క్లుప్తంగా

బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన



కాకానినగర్‌లో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ రమణ

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌లో బీటీ రోడ్డు పనులకు బుధవారం ఆ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకానినగర్ కెనరా బ్యాంకు రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో పరిస్థితిని జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లి రహదారికి రూ18.57లక్షలు మంజూరు చేయించానని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ రత్నాకర్ రెడ్డి, ఏఈ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గోతులు పూడ్చరూ!



కరాసాలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు పాత కరాసా నుంచి కొత్త కరాసాకు వెళ్లే రోడ్డులో చాలా చోట్ల గోతులు ఏర్పడ్డాయి. నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో గుంతలు కప్పలేదు. దీనికి కొద్ది దూరంలో మరో చోట పెద్ద గొయ్యి ఏర్పడింది. దీన్ని స్థానికులు వ్యర్థాలతో కప్పారు. ఈ గొయ్యి ప్రమాదకరంగా తయారయిందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయంలో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పదించి గోతులు పూడ్చాలని కోరుతున్నారు.

మహా ధర్నాను జయప్రదం చేయండి



జూ గేటు వద్ద ధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేత కుమార్, కార్మికులు

ఆరిలోవ: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. ఇందిరాగాంధీ జూ పార్కు ప్రధాన ద్వారం వద్ద జూ కార్మికులతో కలిసి బుధవారం మహా ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ తదితర కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, అంతవరకు కనీస వేతనం రూ.26 వేలకు తక్కువ కాకుండా ఇవ్వాలనే డిమాండ్లతో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జరగనున్న ఈ ధర్నాలో జిల్లాలో కార్మికులంతా కలిసికట్టుగా పాల్గొనాలని కోరారు. జూ పార్కులో సుమారు 20 ఏళ్లకు పైగా పనిచేస్తున్న కార్మికులకు చాలీచాలని వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. వీరికి కనీస వేతనాలతోపాటు వారాంతపు, పండగ సెలువులు కూడా లేవన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాధర్నాలో నాయకులు గళమెత్తుతారని చెప్పారు.

8వ పే కమిషన్ ఏర్పాటు చేయాలి

సీతమ్మధార: 8వ పే కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆల్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు పెన్షనర్లు మాట్లాడుతూ ఎన్‌పీఎస్ రద్దు చేయాలని, ఓపీఎస్ పునరుద్ధరించాలని, బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల పెన్షన్‌ను అప్డేట్ చేయాలన్నారు.

ఆకాశం వైపు.. కూరగాయల చూపు



గోపాలపట్నం రైతు బజారులో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

- భారీగా పెరుగుతున్న ధరలు
- పెద్ద నోటుకు కూడా నిండని సంచి
- రూ. 50 కి చేరిన టమాటా
- రూ.50 దాటేసిన ఉల్లి

గోపాలపట్నం: కూరగాయల ధరలు ఆకాశంవైపు చూస్తున్నాయి. వీటి ధరలు ప్రజల జేబులకు గాయాలు చేస్తున్నాయి. ధరలు ఇలా ఉంటే ఏం కొంటాం, ఎలా తింటామని కొనుగోలుదారులు వాపోతున్నారు. ఉల్లి, టమాటా ధరలు ఠారెత్తిస్తున్నాయన్నారు. ఉల్లి, దుంపలు, వెల్లుల్లి కూడా అదే కోవలోకి చేరుతున్నాయి. మార్కెట్‌లోకి కాయగూరలు కూడా అంతంత మాత్రంగా వస్తుండడంతో కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. కిలో కావలసిన చోట, అరకిలోతో సరిపెట్టుకుంటున్నారు.

బయటి మార్కెట్‌లో మరీ దారుణం

రైతుబజారులో కంటే బహిరంగ మార్కెట్‌లో ధరలు మరీ ఎక్కువగా ఉన్నాయని కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయటిమార్కెట్‌లో ధరలు కిలోకు రూ.5 నుంచి రూ.10 పైనే తేడా ఉండటంతో రైతు బజార్లనే ఆశ్రయిస్తున్నారు.



టమాటా, ఉల్లి కౌంటర్ల వద్ద గుమిగూడిన జనం

అందుబాటులో లేని ఆకుకూరలు

ఎప్పుడూ లేని విధంగా ఆకుకూరల ధరలు సైతం భారీగా పెరిగాయి. ఒక తోటకూర కట్ట రూ.5 పలుకుతోంది. ఇటీవల పడిన వర్షాలకు పంటలు నీట మునిగిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు చెబుతున్నారు.

తగ్గిన దిగుబడి, దిగుమతి

రాష్ట్రంలో పంట దిగుబడి తగ్గదల, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి కూడా తగ్గడం, డిమాండ్ పెరగడంతో ధరలు పెరుగుతున్నాయని రైతు బజారు అధికారులు, బయట వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి, ధరల అదుపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతుబజారులో కూరగాయల ధరలు

కూరగాయలు	(కిలో రూ.లలో)
ఉల్లిపాయలు (పాతవి)	54
దేశవాళీ టమాటా	46
నల్ల వంకాయలు	56
తెల్ల వంకాయలు	36
బెండకాయలు	26
పచ్చిమిర్చి	32
బజ్జీ మిర్చి	50
కాకరకాయ	48
బీరకాయ	42
ఆనపకాయ	22
కాలీఫ్లవర్	44
క్యాబేజీ	29
క్యారెట్	38
గాజర్ క్యారెట్	28
బంగాళ దుంపలు	30
అల్లం (కొత్తది)	50
అల్లం (పాతది)	90
బరబాటి	48
చిక్కుడు కాయలు	80
గోరు చిక్కుడు	40
దోసకాయ	18
బీట్ రూట్	48
బీన్స్ మొదటి రకం	70
బీన్స్ రెండో రకం	60
పొటల్స్	40
క్యాప్సికం పసుపు	64
చేమ దుంపలు మట్టివి	40
చేమ దుంపలు పాతవి	44
కడిగినవి కొత్తవి	44
చిలగడ దుంపలు	40

ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

కాయగూరల ధరలు బాగా పెరుగుతున్నాయి. సామాన్యుడికి అందుబాటులో లేవు. రూ.500 తీసుకెళితే సంచి నిండడం లేదు. టమాటా, ఉల్లి, వంకాయల ధరలు పోటాపోటీగా పెరుగుతున్నాయి. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. -జి .సత్యనారాయణ, బాజీ జంక్షన్

మద్యం ధర కాదు కూరగాయల ధరలు తగ్గించాలి

ప్రభుత్వం మద్యం ధర తగ్గిస్తామని చెబుతోంది. దాని కన్నా ముందే పెరిగిన కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడానికి చర్యలు చేపట్టారు. వారానికి సరిపడా కాయగూరలు కొనాలంటే రూ.1000 వెచ్చించాల్సిన పరిస్థితి ఉంది. పేదలు ఏం తిని బతుకుతారు. - సత్యవతి, గోపాలపట్నం

ప్రజా సమస్యలపై గళం విప్పిన కార్పొరేటర్లు



కౌన్సిల్‌లో మాట్లాడుతున్న 62,40, 58 వార్డు కార్పొరేటర్లు లక్ష్మణరావు ,నాగేశ్వరరావు , లావణ్య

సింథియా: విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని పలు వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు బుధవారం జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై గళం విప్పారు. ఆయా వార్డుల్లో ప్రధాన సమస్యలతో పాటు చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించారు. తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరారు.

వార్డుల వారీగా కార్పొరేటర్లు ప్రస్తావించిన అంశాలు

జీవీఎంసీ 62వ వార్డులో వీధిదీపాల సమస్య తీవ్రంగా ఉందని.. ఎన్టీఆర్‌కాలనీలో యూజీడీ సమస్య సత్వరమే పరిష్కరించాలని కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు కోరారు. కొండవాలు ప్రాంతాల్లో రక్షణగోడలు నిర్మించాలని, త్రినాథపురం కూడలిలో సామాజిక భవనం నిర్మించాలన్నారు. పూర్తిస్థాయిలో పారిశుధ్య సిబ్బందిని నియమించాలని కోరారు.

40వ వార్డు పరిధిలో..

జీవీఎంసీ 40వ వార్డులో ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. యారాడ రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలన్నారు. అదే విధంగా కాకరలోవలో రిటైనింగ్ వాల్, ఏకేసీకాలనీ ప్రవేశ మార్గం డబుల్‌రోడ్డు చేయడంతో పాటు వాంబే, టిడ్కో గృహ సముదాయల్లో రెండో అంతస్తుకు నేరుగా తాగు నీరు సరఫరా అయ్యే విధంగా నూతన పైపులైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. షిప్‌యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ హాలు నిర్మించి ప్రజల అవసరాలు తీర్చాలని విన్నవించారు.

58వ వార్డు సమస్యలపై...

మల్కాపురం: హెచ్‌పీసీఎల్, కోరమాండల్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల వార్డు ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని జీవీఎంసీ 58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య అన్నారు. కాలుష్యం తగ్గేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా యాజమాన్యాలు సీఎస్సార్ నిధులతో ప్రభావిత ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ములగాడ పరిధిలో గల పోర్టు మార్గాన్ని ఆధునికీకరించి ప్రజల ఇబ్బందులకు పరిష్కారం చూపాలన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ జయంతి



దయాళ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రమేష్ తదితరులు

విశాఖ విద్య: పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ స్ఫూర్తితో సమాజ ప్రగతికి అంతా ముందుకు సాగాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తమ రమేష్ అన్నారు. ఎస్‌పీడీ దరి బీజేపీ కార్యాలయంలో దీన దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజకీయాలు, ఆర్థిక విధానాలు మాత్రమే కాకుండా సమాజ సంక్షేమానికి కృషి చేయాల్సిన అవశ్యకతను దయాళ్ చాటిచెప్పారన్నారు. మండల అధ్యక్షుడు గొట్టివాడ వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు చల్ల మంజుల,అప్పలరాజు, చంద్రశేఖర్ రాజు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి

మల్కాపురం: పండిట్ దీన్‌దయాళ్ సిద్ధాంతాలకు బీజేపీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కొక్కిలగడ్డ విజయబాబు అన్నారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా జీవీఎంసీ 59వ వార్డు శాంతిగిరి కాలనీలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, సతీష్, సింహచలం, సత్యనారాయణ, నూకరత్నం, సుజాత తదితరులు పాల్గొన్నారు.



దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఏఐటీయూసీ చొరవతో పీఎఫ్ సర్వీసు క్రమబద్ధీకరణ

ఉక్కునగరం: కర్ణాటకకు చెందిన ఏఐటీయూసీ నాయకుల చొరవతో స్టీల్‌ప్లాంట్ ఆర్‌ఈడీ కాంట్రాక్ట్ కార్మికుల పీఎఫ్ సర్వీసు క్రమబద్ధీకరణ జరిగిందని ఏఐటీయూసీ ఏపీ కౌన్సిల్ సభ్యుడు బి. వెంకటరావు తెలిపారు. ఎస్ఎంఎస్ విభాగంలో బుధవారం నిర్వహించిన ఆర్‌ఈడీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021లో రిఫ్రాక్టరీ కాంట్రాక్టర్ వర్షిణి ఎంటర్‌ప్రైజెస్ తనకు వర్క్ ఇచ్చిన రాశీ రిఫ్రాక్టరీస్‌తో తగాదా పడి ఆ ఏడాది మేలో ఆ పని నుంచి అర్ధాంతరంగా వైదొలిగిందన్నారు. అయితే కార్మికుల పీఎఫ్ ఖాతాలో వైదొలగిన తేదీని ఉద్దేశపూర్వకంగా ఆగస్టు అని తప్పుగా నమోదు చేయడంతో హుబ్లీ పీఎఫ్ ఆఫీసులో 50 మంది కార్మికుల 12 ఏళ్ల పీఎఫ్ సీనియార్టీ, రూ. 2 కోట్ల భవిష్యనిధి స్తంభించిపోయాయన్నారు. దీంతో హెచ్ఆర్ అధికారి రాజేశ్వరరావు, సైటు లీడర్లు రాజు, నాయుడు, నమ్మి అప్పారావును కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీ తీసుకువెళ్లి అక్కడి ఏఐటీయూసీ నాయకులు భగవతి, ఉమేష్, అబ్దుల్ పీర్ జావేద్‌ల సాయంతో అక్కడి ప్రాంతీ పీఎఫ్ కమిషనర్ రామ్ కేశ్ మీనాకు ఫిర్యాదు చేశామన్నారు. వారికి అవసరమైన పత్రాలు అందించిన వారం రోజుల్లోనే సమస్య పరిష్కారం అయిందన్నారు. కార్యక్రమంలో చంద్రరావు, జగ్గారావు పాల్గొన్నారు.

రెండు ఆస్పత్రులను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



రెయిన్‌బో ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి. జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం బుధవారం హెల్త్ సిటీలో గల రెయిన్‌బో, స్టార్ పినాకిల్ ఆస్పత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడి అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రిజిస్ట్రేషన్ ఉన్నదీ లేనిదీ తనిఖీ చేశారు. ఫారం-ఎఫ్ ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేస్తున్నారో లేదో పరిశీలించారు. 5 శాతం ఉచిత స్కానింగ్‌లు చేస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు. 5 శాతం ఉచిత స్కానింగ్‌కు విడిగా రిజిస్టర్ నిర్వహించాలని, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని తెలిపే సైన్ బోర్డు ప్రతి స్కానింగ్ సెంటర్‌లో ఉండాలన్నారు. గైనకాలజిస్ట్, రేడియాలజిస్ట్ తప్పనిసరిగా ఉండాలని, డాక్టర్ల అర్హత సర్టిఫికెట్లు స్కానింగ్ సెంటర్లలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ప్రతి ఒక్క ఏఎన్ఎం వ్యాక్సినేషన్ రోజున ముందుగా లబ్ధిదారుల జాబితా దగ్గర పెట్టుకోవాలని, ఆ జాబితా ప్రకారం వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు క్లోరినేషన్ చేయాలని, మంచి నీరు లేదా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమలు, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, మురుగు కాల్వలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించుకోవాలని, దోమ తెరలు వాడాలని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ మోహనరావు

మహారాణిపేట : భవిష్యత్తును నాశనం చేసే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం .మోహన్‌రావు అన్నారు. బుధవారం ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా మహిళా జూనియర్ కాలేజీలో సెట్విస్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం, మహిళల అక్రమ రవాణా, సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఒక వ్యక్తి చెడు వ్యసనాలకు అలవాటు పడితే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు ఎప్పటికప్పుడు వారిని గమనించాలన్నారు. ఏఎస్ రాజా మహిళా జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కాసు మాట్లాడుతూ చెడు వ్యసనాలకు అందరూ దూరంగా ఉండాలని, సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విస్ మేనేజర్ ఎస్.వెంకటేష్, జూనియర్ కాలేజీ అధ్యాపకులు జి.వర లక్ష్మి, ఎం.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విశాఖను మొదటి స్థానంలో నిలబెడదాం



చీపుర్లతో శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు, డిప్యూటీ మేయర్ శ్రీధర్ తదితరులు

- ఎమ్మెల్యే గణబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం:గోపాలపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను మొదటి స్థానంలో నిలబెట్టాలని ఎమ్మెల్యే గణబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కోరారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాపాలెం వుడాలేఅవుట్‌లోని గ్రీన్ బెల్ట్ వాకింగ్ పార్క్‌లో నిర్వహించిన స్వచ్ఛతా హీ హి సేవ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కాలనీ వాసులతో కలిసి ఎమ్మెల్యే గణబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ చీపుర్లు పట్టి వీధులను శుభ్రం చేశారు. గ్రీన్ బెల్ట్ వాకింగ్ ట్రాక్ పరిసరాల్లో చెత్తాచెదారాలు తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్- 2024లో విశాఖను అగ్రస్థానంలో నిలిపేందుకు నగరపాలక సంస్థ అధికారులు కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. కాలనీలో పారిశుధ్య నిర్వహణపై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్ కుమార్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కాలనీ పెద్దలు ఈటి సత్యనారాయణ, సి.హెచ్.వి.సురేష్ పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్లపై పార్కింగ్‌తో అవస్థలు

- జీవీఎంసీ కౌన్సిల్‌లో సాక్షి కథనంపై చర్చ
- యాజమాన్యాలు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని డిమాండ్



పార్కింగ్ విషయంపై కౌన్సిల్‌లో మాట్లాడుతున్న 61వ వార్డు కార్పొరేటర్ సుధ

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో వివిధ పనుల కోసం వచ్చే కాంట్రాక్ట్ కార్మికులు ద్విచక్ర వాహనాలను సర్వీసు రోడ్లపై పార్కు చేయడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ కార్మికులు వాహనాల పార్కింగ్ కోసం పడుతున్న ఇబ్బందులపై బుధవారం సాక్షిలో × పార్కింగ్ కష్టాలు₹ శీర్షికన ప్రచురితమైన కథనానికి కార్పొరేటర్ సుధ స్పందించారు. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించారు. పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసేలా హెచ్‌పీసీఎల్ యాజమాన్యంతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపాలని మేయర్ హరివెంకటకుమారితో పాటు కమిషనర్ సంపత్‌కుమార్‌ను కోరారు. అలాగే వార్డులో ప్రధాన సమస్యలను ప్రస్తావించారు. పూర్తిస్థాయిలో పారిశుధ్య కార్మికులను నియమించాలని.. వీధి లైట్లు వేయాలని, గాంధీజీవీధి పరిధిలో గల సచివాలయాన్ని మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపంపై అంతస్తులోకి మార్చాలని ఆమె కోరారు.

అండర్ పాస్‌లో ఊట నీటితో ఇక్కట్లు



చంద్రనగర్ అండర్‌పాస్ గోడల నుంచి వస్తున్న నీరు



రాత్రి సమయంలో అండర్‌పాస్‌లో చేరిన నీరు

- మోకాలిలోతు నీరు చేరుతున్న వైనం
- రాత్రి సమయంలో లైట్లు లేక ఇబ్బందులు

గోపాలపట్నం: చంద్రనగర్ అండర్‌పాస్ వేలో ఊట నీరుతో ప్రయాణికులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు ఆగినా నీటి బెడద తగ్గలేదని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయంలో ఈ నీరు మోకాలి లోతు వరకు చేరడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక పోవడం వల్లే ఈ ఇబ్బంది ఏర్పడుతోందని చెబుతున్నారు. ఊట నీటిని రైల్వే అధికారులు మోటార్లతో తోడుతున్నా ఫలితం ఇవ్వడం లేదని చెబుతున్నారు. అండర్‌పాస్‌వే గోడల నుంచి నీరు ఫోర్స్‌గా వస్తోందని, ఈ విధంగా చాలా చోట్ల నీరు లీకవడంతో రోడ్డు నాచు పడుతోంది. దీని వల్ల పాదచారులు జారి పడుతున్నారు. అధికారులు స్పందించి ఊటనీటి సమస్యకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నీరు పారుతుండడంతో నాచుదేరిన రోడ్డు

మంచిపాలన అందించాం

గోపాలపట్నం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో మంచి పరిపాలన అందించామని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. 100 రోజుల పాలనపై జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ గ్రౌండ్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్‌తో పాటు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. కలెక్టర్ హరేంద్రిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాను ఏ విధంగా అభివృద్ధి చేయాలో.. ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో ప్రజల అభిప్రాయాలు కూడా తెలియజేయవచ్చునన్నారు. విజయవాడ వరద ప్రభావి ప్రాంతాల్లో సేవలు అందించిన పారిశుధ్య కార్మికులను కలెక్టర్, ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, పక్కన ఎమ్మెల్యే గణబాబు

కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, జోన్-8 కమిషనర్ హేమావతి, ఏపీడీ శ్రీరామ్, వార్డు అధ్యక్షుడు బొడ్డేటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని టీఎంసీ కార్మికుల ధర్నా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆర్ఎంహెచ్‌పీ విభాగంలోని టీఎంసీ కార్మికులకు ఆగస్టు నెల జీతాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం విభాగాధిపతి కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ విభాగంలో ఫునిక్స్, మాస్, నాగార్జున కాంట్రాక్టర్ల వద్ద సుమారు 500 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వారికి ఇప్పటి వరకు జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నారన్నారు. యాజమాన్యం జోక్యం చేసుకుని జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.శ్రీనివాసరావు, పి. మసేను, నమ్మి సోమునాయుడు, డి.ఎస్.వి. శ్రీనివాసరావు, బి.ఆనంద్, బంగాయ్య పాల్గొన్నారు.